క్లుప్తంగా

మంత్రికి సన్మానం



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న రైతులు

మంథని: సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నందుకు గాను మంథని ప్రాంత రైతులు మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించారు. మంత్రి నివాసంలో వరి పంట దిగుబడిని అందించారు. కాగా పాత కెనాల్ పూడితతీత వల్ల సాగునీరు అందడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శీలసముద్రం చెరువు కట్టపై రైతులు నడిచేందుకు అనువుగా లేదని చెప్పగా, సింగరేణి మొరం పోయించి సౌకర్యం కల్పిస్తామని మంత్రి తెలిపారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మంథని మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం, బ్యాంకు లింకేజీ సంఘాలకు చెక్కులు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రమ, కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు. అలాగే సమస్యలు పరిష్కరించాలని మంత్రికి మంథని మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు వినతిపత్రం అందించారు.

జాతీయ పోటీలకు ఎంపిక



సుల్తానాబాద్: జాతీయ సెపక్‌తక్రా పోటీలకు పట్టణంలోని ఐపీఎస్ పాఠశాల విద్యార్థి కల్యాణ్ ఎంపికయ్యారని కరస్పాండెంట్ సంజయ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని స్వప్నకాలనీలో ఉన్న పాఠశాలలో మంగళవారం విద్యార్థిని అభినందించారు. ఈనెల1, 2 తేదీల్లో కామారెడ్డి జిల్లాలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 బాలుర సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, వ్యాయామ టీచర్లు సత్యం, ఇక్బాల్, శివ, సతీశ్ పాల్గొన్నారు.

ప్రజాపాలనతో స్వర్ణమయం



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ లక్ష్మి

సుల్తానాబాద్: ప్రజాపాలనతో రాష్ట్రం స్వర్ణమయంగా మారుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్ర పాలన విజయోత్సవ ర్యాలీని మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 8 వరకు ప్రజాపాలన విజయోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు సహకరించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎస్ రోజా

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: కాలుష్య నియంత్రణకు ప్రతీఒక్కరు సహకరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఎస్ రోజా అన్నారు. కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు కాట్నపల్లిలోని ఇటుక బట్టీల వద్ద వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, పొగ తాగటం, వాయు కాలుష్యంతో వచ్చే వ్యాధులపై కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకట్‌రెడ్డి, ఏఎన్‌ఎం కవిత, ఆశ లావణ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

ఓదెల: మండలంలోని ఓదెల మోడల్ స్కూల్, కనగర్తి పాఠశాలకు చెందిన విద్యార్థులు హన్మకొండలో జరిగిన 68వ జాతీయ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఓదెల మోడల్ స్కూల్లో చదువుతున్న అక్కాచెల్లెళ్లు వేల్పుల అక్షిత, వేల్పుల అక్షయ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కనగర్తి గ్రామానికి చెందిన ఎడొడ్డె కీర్తన సిల్వర్ మెడల్ సాధించింది. వీరిని ఎంఈవో ఎర్ర రమేశ్, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

ఈ కేంద్రం మాకొద్దు

- పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ
- దాదాపు 120 క్వింటాళ్లు మాయం
- ఆరుగాలం దొంగల పాలైందని బాధితుల ఆవేదన



'ఈ ఫొటోలో ఉన్నది ఆరుగాలం శ్రమించే అన్నదాతలు. ఇటీవల వరిపంట కోసి ధాన్యాన్ని పారుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి తరలించారు. కాగా కేంద్రంలో తమ ధాన్యం చోరీకి గురికావడంతో 'ఈ కేంద్రం మాకొద్దు' అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేదని, ఊరు చివర చిన్న గుట్టపై కేంద్రం ఏర్పాటు చేయడంతో ఏటా ధాన్యం దొంగలపాలవుతోందని వాపోయారు. పీఏసీఎస్ కేంద్రాన్ని రద్దు చేసి ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని కోరారు'.



కాంట ఆలస్యంతో పేరుకుపోయిన కుప్పలు

ముత్తారం: మండలంలోని పారుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆదివారం రాత్రి 120 క్వింటాళ్లకు పైగా ధాన్యం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో ఆరుగాలం శ్రమ దొంగలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులే ధాన్యం చోరీ చేశారని ఆరోపిస్తున్నారు. పారుపల్లిలో 1,206 హెక్టార్లలో వరి వేశారు. దాదాపు 3,500 క్వింటాళ్ల ధాన్యం కాంటా పెట్టగా, 3వేల క్వింటాళ్లకు గాను సదరు రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. కేంద్రంలో 20 లారీల ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి.

అసలు దొంగలెవరు..?

గ్రామానికి చెందిన సంకుర్తుల మమత, భూషవేన సందీప్, ముస్కుల కుమారస్వామి, ఏదుల మల్లేశ్, కోట ఎల్లయ్య, అనవేన వెంకటేశ్, మీనుగు రవి, సాగర్ అనే రైతుల ధాన్యం సుమారు 120క్వింటాళ్లకు పైగా దొంగలు ఎత్తుకెళ్లారు. కాగా ధాన్యం చోరీ చేసింది దొంగలా, స్థానిక రైతులా లేదా హమాలీలా అని కేంద్రంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. దీంతో అసలు దొంగలెవరనేది అంతుచిక్కడం లేదు. కేంద్రంలో అక్కడక్కడా కుప్పల నుంచి ధాన్యం పోయినట్లు రైతులు చెప్తున్నారు. సంబంధిత అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుంటే దొంగలు బయటపడే అవకాశం ఉంది.

ట్రాక్టర్ ధాన్యం మాయం



నాకున్న 20 గుంటలతో పాటు 5 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి వేశా. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోసినం. ఒక ట్రాక్టరు ధాన్యం మాయమైంది. సుమారు 15 క్వింటాళ్ల ధాన్యం ఖరీదు, బోనస్ మెత్తం రూ.40వేలు నష్టపోయా. కౌలు చేసుకుని బతికే మాకు న్యాయం చేయాలి.

– సంకుర్తుల మమత, కౌలు రైతు

15 బస్తాల ధాన్యం ఎత్తుకెళ్లారు



నాకున్న ఐదెకరాల పొలంలో వేసిన వరి కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన. కుప్పలో నుంచి 15బస్తాల ధాన్యం ఎత్తుకెళ్లారు. కేంద్రంలో రైతుల శ్రమకు భద్రత లేదు. ఎవరు ఎత్తుకెళ్లారో అధికారులు విచారణ చేపట్టి బాధిత రైతులకు న్యాయం చేయాలి.

– ముస్కుల కుమారస్వామి, రైతు

బాధితులకు న్యాయం జరగాలి



కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఎత్తుకెళ్లారనే విషయం తెలియగానే పరిశీలించిన. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని బాధితులకు చెప్పిన. కేంద్రం ఊరు చివర ఉండటంతో వాచ్‌మెన్ ఉండటానికి ఎవరూ ముందుకురావడం లేదు. సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి అవకతవకలు జరగలేదు. బాధితులకు న్యాయం జరగాలి. – అల్లాడి యాదగిరిరావు, పీఏసీఎస్ చైర్మన్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం వేలాది మంది సంచరించే ప్రదేశంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. విద్యుత్ హైటెన్షన్ టవర్ గద్దెపై ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు కానీ కంచె లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ, అనుబంధ యూనియన్ ఐఎన్‌టీయూసీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి కోరారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు 240గజాల భూమి, ఇంటి నిర్మాణానికి వడ్డీలేని రూ.20లక్షల రుణం ఇస్తామని చెప్పారన్నారు. పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ మాఫీ, ప్రతీ ఏరియాలోని హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మారుస్తామని తదితర హామీలు అమలు కాలేదన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు విచ్చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సింగరేణి కార్మికుల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. నాయకులు మాదాసు రామ్మూర్తి, నూనె కొమురయ్య, వడ్డెపల్లి శంకర్, చెల్పూరి సతీశ్, ఇందూరు సత్యనారాయణ, పాషం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మిక సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. మంగళవారం ఏరియా వర్క్‌షాప్‌లో గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల సొంతింటి కల, అలవెన్స్‌లపై ఐటీ మాఫీ లాంటి అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచి జీవో అమలు చేసేలా యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. నాయకులు ఆరేపల్లి రాజమౌళి, తోట నరహరిరావు, కారం సత్తయ్య, నంది నారాయణ, బాగే రవి, బొడ్డుల ఓదెలు, సంతోష్, వంగల శివరామరెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

రామగిరి ఖిల్లా అభివృద్ధి చేయండి



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: దేశంలో ఎక్కడాలేనన్ని ఔషధ మూలికలు గల ఖిల్లాగా దేశవ్యాప్తంగా రామగిరి ఖిల్లా ప్రసిద్ధి చెందిందని బీజేపీ రాష్ట్రవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో మంగళవారం ఆయన ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. బుధవారం పెద్దపల్లిలో జరిగే కార్యక్రమానికి హాజరవుతున్న సీఎం రామగిరిఖిల్లా అభివృద్ధికి హామీ ఇవ్వాలని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.

మీ పరిధిలో లేకుంటే కేంద్రానికి ఇవ్వండి..

జిల్లాలోని రామగిరిఖిల్లా అభివృద్ధి అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది అని, ప్రభుత్వపరమైన ఇబ్బందులు ఉంటే ఈ ప్రక్రియ కేంద్రానికి బదలాయించాలని సురేశ్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక పర్యాటక ప్రదేశాల అభివృద్ధి కోసం నిధులు వెచ్చిస్తోందని గుర్తు చేశారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులను సన్మానించారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, కార్పొరేటర్లు శంకర్‌నాయక్, సాగంటి శంకర్, దేవనపల్లి చక్రపాణి, జక్కుల దామోదర్‌రావు, వీరారెడ్డి, మార్క రాజు, కేశవులు, దుర్గాప్రసాద్, సదానందం, కిషన్ నాయక్, రాజేశం, రాములు, అవినాష్ పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ అంతర్గాం మండల అధ్యక్షుడు పెండ్రు హన్‌మాన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పనిచేస్తున్నారన్నారు. మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, పూదరి సత్తయ్యగౌడ్, గాదె సుధాకర్, మద్దిత్తిరుపతి, బరపటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బంద్ పాక్షికం

జ్యోతినగర్: చిరు వ్యాపారులకు అండగా చేపట్టిన బీఆర్‌ఎస్ బజార్ బంద్ కార్యక్రమం పాక్షికంగా కొనసాగింది. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో మంగళవారం బంద్ ప్రభావం పాక్షికంగా కొనసాగింది. బజార్ బంద్‌లో భాగంగా మేడిపల్లి సెంటర్‌లో ఉన్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు దాసారపు వేణు, సోమిడి రాములను ఎన్టీపీసీ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఓదెల: ప్రభుత్వ హాస్టళ్లల్లో పేరుకుపోయిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఓదెలలోని కస్తూరిబా బాలికల, మోడల్ హాస్టల్, బీసీ హాస్టళ్లను మంగళవారం వారు తనిఖీ చేశారు. హాస్టళ్లల్లో భోజనం నాణ్యత విషయంపై ఆరా తీశారు. బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కొయ్యడ సతీశ్‌గౌడ్, బీఆర్‌ఎస్వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఉపసర్పంచు తీర్థాల కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రజాప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక జనక్‌భవన్‌లో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. రైతు రుణమాఫీ, గృహలక్ష్మి తదితర పథకాలతో అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ దగ్గరవుతుందన్నారు. పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్, సొంతింటి కల నిజం కాబోతోందని పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగే యువవికాసం బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని, ప్రజలు, కార్మిక, కర్షక వర్గాలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, కలవేన శ్యామ్, భూచయ్య, సదానందం, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం తర్వాతే అభివృద్ధి చేపట్టాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: షాపులు కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా మంగళవారం గోదావరిఖని, ఎన్టీపీసీలో షాపుల బంద్ నిర్వహించారు. బీఆర్‌ఎస్ శ్రేణులు బైక్‌లపై తిరుగుతూ బంద్‌కు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనతో ప్రజలు భయాందోళనలో బతుకుతున్నారన్నారు. అభివృద్ధి, సుందరీకరణ పేరుతో 50 ఏళ్లుగా ఉంటున్న చిరువ్యారుల దుకాణాలు కూల్చివేస్తున్నారన్నారు. ప్రజా వంచనను నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణదాసు మారుతి, అచ్చె వేణు, చల్లా రవీందర్‌రెడ్డి, బొడ్డుపల్లి శ్రీనివాస్, సట్టు శ్రీనివాస్, బొబ్బిలి సతీశ్, అర్శనపల్లి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, కుడుదుల శ్రీనివాస్, జడ్సన్, సారయ్య, కోడి రామకృష్ణ, వెంకన్న, ఆవునూరి వెంకటేశ్ పాల్గొన్నారు.



రామగుండం: బహుమతి అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్



గోదావరిఖని: ప్రారంభిస్తున్న సేవా అధ్యక్షురాలు

దివ్యాంగుల దినోత్సవం

రామగుండం/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/జూలపల్లి/రామగిరి/ఎలిగేడు/గోదావరిఖని: జిల్లావ్యాప్తంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

• ఆర్థికసాయం అందజేత

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద తమ్మడవేని బొందవ్వ, కీ.శే కనుకయ్య కూతురు తమ్మడవేని రజిత వివాహం ఈనెల 5న నిశ్చయమైంది. కాగా రజితకు సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దారవేని నర్సింహయాదవ్ రూ.10వేల నగదు అందజేశారు. మల్లెత్తుల సంతోష్, కనుకయ్య, శ్రీధర్, కొమురయ్య, కొమ్మ పోచాలు, బండి స్వామి ఉన్నారు.

• ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలి

గోదావరిఖనిటౌన్: బీజేపీ నాయకులు మంగళవారం స్థానిక పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి పట్టభద్రుల ఎన్నికల ఓటు నమోదు గురించి వివరించారు. డిసెంబర్ 9వ తేదీలోపు పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి సూచించారు. నాయకులు కోడూరి రమేశ్, గుండబోయిన భూమయ్య, మిట్టపల్లి సతీశ్, బాణాల స్వామి, కోమళ్ల మహేశ్, కొండపర్తి సంజీవ్, రంజిత్, పద్మ, అపర్ణ పాల్గొన్నారు.

• వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించాలి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డితో ప్రకటన చేయించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను సీఐటీయూ నాయకులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉల్లి మొగిలి, ఆర్జీ–2 అధ్యక్షులు భూమయ్య, నాయకులు రామన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

• ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

పాలకుర్తి: మాల సంఘం మండల నాయకులు మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌ను కలిశారు. నియోజకవర్గ పర్యటనకు వెళ్తున్న వివేక్‌ను బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద నాయకులు తొగరి తిరుపతి, వేల్పుల రాజ్‌కుమార్, దేవీ లక్ష్మీనర్సయ్య, సంతపూరి తిరుపతి, లక్ష్మీనారాయణ, రావుల నారాయణ వివేక్‌ను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహభేరి సభను విజయవంతం చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

• ఆధ్యాత్మికతతోనే సమాజంలో శాంతి

మంథని: ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తిరుపతికి చెందిన కోడూరి పద్మావతి అన్నారు. మంథనిలోని మహాలక్ష్మీ ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పారాయణం సామూహికంగా పఠించడం ద్వారా ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందన్నారు. అంతకు ముందు అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు.

• యువతకు నిరుద్యోగ భృతి ప్రకటించాలి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు వెంటనే భృతి ప్రకటించాలని మున్నూరుకాపు సంఘం యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వంలో 5లక్షల మందికి పైగా నిరుపేదలు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ఒక్కరికైనా రేషన్‌కార్డు మంజూరు చేశారా అని ప్రశ్నించారు.

• జిల్లా పోటీలకు ఎంపిక

పాలకుర్తి: మండలంలోని జయ్యారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి గణితం టాలెంట్ టెస్టు పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల గణిత ఉపాధ్యాయులు పిట్టల హరిప్రసాద్ తెలిపారు. ఈనెల 2న మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి గణిత టాలెంట్‌టెస్ట్ పోటీలు నిర్వహించారు. జయ్యారం పాఠశాలకు చెందిన రుద్ర నిఖిల్ మొదటి స్థానం, శ్రీజ రెండోస్థానం, అక్షిత మూడోస్థానం సాధించారు.

• క్షీరాభిషేకం

ఎలిగేడు: మండలానికి పోలీస్‌స్టేషన్ మంజూరు కావడంపై మండల కేంద్రంలోని బస్టాండులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

• కేజీబీవీ హాస్టల్ సందర్శన

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ కేజీబీవీ హాస్టల్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ సందర్శించారు.

• రేషన్ బియ్యం పట్టివేత

గోదావరిఖని: వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్థానిక రాజేశ్ థియేటర్ సమీపంలో సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న 8 టన్నుల బియ్యాన్ని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రెస్టారెంట్‌లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న జోన్ ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని ఓ రెస్టారెంట్‌లో జోన్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఎన్టీపీసీ రామగుండం రాజీవ్ రహదారి మెయిన్ రోడ్‌లో గల రెస్టారెంట్‌తో పాటు మరో స్వీట్ హౌస్‌లో ఆహార పదార్థాల నాణ్యతను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.

మానవత్వం చాటుకున్న మాజీ ఎంపీపీ

కాల్వశ్రీరాంపూర్: ప్రమాదంలో గాయపడిన దివ్యాంగుడికి చికిత్స చేయించి మానవత్వం చాటుకున్నారు మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్. మండల కేంద్రం నుంచి మంగళవారం మొట్లపల్లికి వెళ్తున్న దివ్యాంగుడు ముద్దసాని లక్ష్మీపతి ప్రమాదవశాత్తు తన ట్రైసైకిల్ నుంచి పడి గాయాల పాలయ్యాడు. అటుగా వెళ్తున్న మాజీ ఎంపీపీ స్పందించి తన కారులో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. సారయ్యగౌడ్‌కు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



డిపాజిట్ పత్రాలు అందిస్తున్న నాయకులు

మంథని: మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన మాజీ వార్డుసభ్యుడు అరెల్లి సతీశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా అతడి మిత్రులు రూ.21వేలు అతని కుటుంబానికి అందించారు. సతీశ్ పనిచేసే కంపెనీ తోటి డ్రైవర్లు, రూ.50వేలు మొత్తం సతీశ్ కూతురు నిత్యశ్రీ పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుడిసె గట్టయ్య, కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి తోకల మల్లేశ్ ఉన్నారు.